


www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY




సంపుటి: 01 | సంచిక: 272 | హైదరాబాద్ | ఆదివారం | 25-01-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు


## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత దుర్మార్గం

**ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏ సంస్కృతి?**
**సూత్రధారులు, పాత్రధారులు ఎవరో తేలాల్సిందే**
**ప్రజల గోప్యతను తుంగలో తొక్కిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన అప్రజాస్వామిక విధానాలపై పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం ప్రజా భవన్ లో

..మిగతా 3లో




## ఆయన వెనక ఎవరో ఉన్నారు



**ఆస్తుల కోసం విషపు రాతల**
**సైట్ నిబంధన ఎప్పుడో ఉంది**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** సింగరేణి టెండర్ల వివాదంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. విమర్శలకు కారణమైన 'సైట్ విజిట్' నిబంధన తమ ప్రభుత్వం తెచ్చింది కాదని, 2018లోనే కోల్ ఇండియా దీనిని ప్రవేశపెట్టిందని ఆధారాలతో సహా బయటపెట్టారు. 2021లో ఈ నిబంధనలు ఖరారైనప్పుడు తాము అధికారంలోనే లేమని, కావాలనే కొందరు రాబందుల్లా సంస్థ ఆస్తుల కోసం తప్పుడు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో అపోహలు ఉండకూడదనే ఉద్దేశంతోనే నైనీ కోల్ బ్లాక్ టెండర్లను రద్దు చేశామని..

..మిగతా 3లో



# టార్గెట్ ఫిక్స్..?

**ఒకరి వెనక మరొకరు..?**
**ఇప్పుడు భట్టి వంతు**
**పేర్లు చెప్పకుండానే అగ్గి**
**సీఎం, మంత్రుల మధ్య చల్లారని నిప్పు**
**తెర వెనక ఉన్నదెవరు..?**
**ఆఫ్ ది రికార్డుగా విమర్శలు**
**మంత్రులకు కూడా జిల్లాల్లో వ్యతిరేకులు**
**సీఎంకు అనుకూలంగా**
**మారుతున్న మంత్రుల వివాదాలు**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** రాష్ట్ర కేబినెట్ లో వివాదాలు చల్లారడం లేదు. ఒకరి వెనక మరొకరు.. ఇలా మంత్రులు ఏదో ఒక అంశంలో సీఎం టార్గెట్ గా విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఒక ఇష్యూని బేస్ చేసుకుని తుదకు సీఎం దగ్గరకే విమర్శలు తీసుకువస్తున్నారు. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కూడా రోడ్డెక్కారు. ఓ మీడియా సంస్థ అధినేత ముసుగులో సింగరేణి వివాదంపై చివరకు సీఎం రేవంత్ రెడ్డి దగ్గరకే వచ్చారు. అయితే, ఎక్కడా పేరు, హోదా చెప్పకుండానే అందరికీ అర్థమయ్యేలా విమర్శలకు దిగారు. దీంతో తెలంగాణ మంత్రి మండలి చుట్టూ గతంలో ఎన్నడూ లేనంతగా చర్చలు, వివాదాలు జరుగుతున్నాయి. తాజాగా ఒకేసారి ఇద్దరు మంత్రులపై రెండు ప్రముఖ మీడియా సంస్థలు రాసిన కథనాలే కారణంగా సీఎం చుట్టూరా వివాదాలు అల్లుకుంటున్నాయి. నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి అంటూ పేరు ప్రస్తావించకుండా ఆయన వ్యక్తిగత అంశంపై ఓ కథనం ప్రసారం చేయడం.. దానిపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

..మిగతా 2లో

## అందరి బాగోతాలను బయటపెడతాం

**ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో అక్రమాల గుర్తింపు**
**త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్**
**ధరణి పోర్టల్ లొసుగులతోనే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు**
**9 జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు**
**ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక**
**మంత్రి శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారినీ రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలోని కొందరు పెద్దలు ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను కాజేశారని ఆరోపించారు. దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించినట్లు వెల్లడించారు. ఇందులో అనేక అవినీతి అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్

..మిగతా 4లో

## సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి

**గతంలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం దోచుకుందన్న బండి సంజయ్**
**ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు అదే పనిలో ఉన్నారని ఆరోపణ**
**రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని వ్యాఖ్య**




## ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో భేటీ కానున్న కేటీఆర్, హరీశ్

**బీఆర్ఎస్‌లో ఒత్తిడి పెంచుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు**
**ఫాంహౌస్‌కు వెళ్లనున్న కేటీఆర్, హరీశ్, ముఖ్య నేతలు**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** ఫోన్ ట్యాపింగ్ కేసు నేపథ్యంలో బీఆర్ఎస్‌లో రాజకీయ ఉత్కంఠ పెరుగుతోంది. ఈ పరిణామాల మధ్య మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు ఈ మధ్యాహ్నం ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లనున్నారు. అక్కడ బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పార్టీకి చెందిన ముఖ్య నేతల కీలక

..మిగతా 2లో

## నాంపల్లిలో అగ్ని ప్రమాదం..

**ఫర్నీచర్ షాపులో చెలరేగిన మంటలు**
**నాలుగు అంతస్తులకు వ్యాపించిన మంటలు**
**భవనంలో ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం**
**మంటలు ఆర్పుతున్న నాలుగు ఫైరింజన్లు**



**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** హైదరాబాద్ నగరంలోని రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో శనివారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఒక ఫర్నిచర్ షోరూమ్‌లో ఒక్కసారిగా చెలరేగిన మంటలు

..మిగతా 2లో

## స్టార్టప్ కేంద్రంగానే టీ హబ్..

టీ హబ్ ను ప్రత్యేక స్టార్టప్‌ల కేంద్రంగానే గుర్తించాలని చెప్పారు
ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తున్నారన్న వార్తలపై స్పందించిన రేవంత్ రెడ్డి
అమెరికా పర్యటన నుంచే
సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు




## నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను

*ఫోన్ ట్యాపింగ్ కేసులో*
*బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్ కు సిట్ నోటీసులు*
*విమర్శలు చేసిన 12 గంటల్లోపే చర్యలంటూ ఆరోపణ*
*హెచ్చరికలకు భయపడనని,*
*ఆధారాలతో సమాధానమిస్తానని వెల్లడి*
*ఇది రేవంత్ రెడ్డి సర్కారు ప్రతీకార చర్యేనని విమర్శ*
*సజ్జనార్‌ను సిట్ చీఫ్‌గా నియమించడాన్ని*
*నైతికంగా ప్రశ్నించానని స్పష్టీకరణ*

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో సిట్ దర్యాప్తును విమర్శిస్తూ మీడియా సమావేశం నిర్వహించిన 12 గంటల్లోపే తనకు నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేత

..మిగతా 3లో



# లీకుల టెన్షన్

*ఫోన్ ట్యాపింగ్ పై అంతా అయోమయం*
*అరెస్ట్, నోటీసులు అంటూ లీకులు*
*విచారణ కంటే అవే ప్రమాదమంటూ ఆందోళన*




## నైనీ టెండర్ రద్దు చేశారంటే.. స్కాం జరిగినట్టే కదా?

*సైట్ విజిట్ అమలు. నైనీ రద్దుతో అవినీతి తేటతెల్లం*
*బొగ్గు టెండర్లు ఎందుకు రద్దు చేశారు...?*
*మాజీ మంత్రి హరీశ్ రావు*
*అవినీతి జరగనప్పుడు భయపడ్డారెందుకూ..?*




**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):** బొగ్గు కుంభకోణం విషయంలో అవినీతి ఆరోపణలు రావడంతో నైనీ టెండర్ రద్దు చేశారంటే, స్కాం జరిగినట్లేనని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావుఆరోపించారు. శనివారం హరీష్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. నైనీ వ్యవహారంలో మంత్రి భట్టి మసిబూసి మారేడు కాయ చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణిలో సోలార్ స్కాం చేసిన ఆరోపణలపై మౌనం

..మిగతా 3లో

## షోరూం వద్దే రిజిస్ట్రేషన్స్

రాష్ట్రంలో కొత్త పాలసీ
కార్యాలయాల చుట్టూ తిరుగుడకు బ్రేక్
ప్రయోగాత్మకంగా
ఒకచోట అమలు సక్సెస్
టూవీలర్, ఫోర్ వీలర్ నూతన
వాహనాలకే కొత్త విధానం





# నాంపల్లిలో అగ్ని ప్రమాదం..

**మొదటిపేజీ తరువాయి**

నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తానికి వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. నాంపల్లి ప్రధాన రహదారిపై ఉన్న ఒక నాలుగు అంతస్తుల కమర్షియల్ భవనంలో ఈ ప్రమాదం సంభవించింది. భవనం కింద ఉన్న సెల్లార్‌లోని హోల్‌సేల్ ఫర్నిచర్ షాపులో మొదట మంటలు ప్రారంభమయ్యాయి. లోపల ఫర్నిచర్ సామాగ్రి అధికంగా ఉండటంతో మంటలు వేగంగా పై అంతస్తుల వరకు వ్యాపించాయి. దట్టమైన పొగలు పరిసర ప్రాంతాలను కమ్మేయడంతో జనం పరుగులు తీశారు.

ప్రమాద సమయంలో భవనంలో ఇద్దరు నుండి నలుగురు పిల్లలు చిక్కుకున్నట్లు వార్తలు రావడంతో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. అయితే, అగ్నిమాపక సిబ్బంది రాకముందే స్థానిక యువకులు సాహసించి భవనంలోకి వెళ్లి పిల్లలను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భవనంలోని మిగిలిన కుటుంబాలను , పక్కనే ఉన్న రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లోని నివాసితులను అధికారులు వెంటనే ఖాళీ చేయించారు.

మంటలను అదుపు చేసేందుకు నాలుగు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే, భవనం ఇరుకైన సందులో ఉండటం , చుట్టూ సెట్ బ్యాక్స్ (ఖాళీ స్థలం) లేకపోవడంతో అగ్నిమాపక యంత్రాలు లోపలికి వెళ్లడానికి వీలు పడలేదు. దీంతో సిబ్బంది పక్కనే ఉన్న భవనాల గోడలపైకి ఎక్కి ప్రాణాలకు తెగించి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ప్రధాన రహదారిపైనే ఈ ప్రమాదం జరగడంతో నాంపల్లి నుంచి అబిడ్స్ వెళ్లే మార్గంలో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పరిస్థితిని గమనించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే వాహనాల రాకపోకలను ఇతర మార్గాల్లోకి మళ్లించారు. గంటల తరబడి శ్రమించిన అనంతరం అగ్నిమాపక సిబ్బంది మంటలను ప్రాథమికంగా అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఆస్తి నష్టం భారీగానే ఉన్నప్పటికీ, ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నగరంలోని ఇరుకైన ప్రాంతాల్లో అగ్నిమాపక నిబంధనలు పాటించకపోవడం వల్ల ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# షోరూం వద్దే రిజిస్ట్రేషన్స్

- **రాష్ట్రంలో కొత్త పాలసీ**
- **కార్యాలయాల చుట్టూ తిరుగుడకు బ్రేక్**
- **ప్రయోగాత్మకంగా ఒకచోట అమలు సక్సెస్**
- **టూవీలర్, ఫోర్ వీలర్ నూతన వాహనాలకే కొత్త విధానం**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

రాష్ట్రంలో కొత్త వాహనాల కొనుగోలుదారులకు రవాణా శాఖ ఊరటనిస్తూ షోరూమ్‌లలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. ఇకపై ద్విచక్ర వాహనాలు, కార్ల రిజిస్ట్రేషన్ కోసం ఆర్టీఓ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. వాహనం కొన్న చోటే డీలర్ ఆన్‌లైన్‌లో ఇన్వాయిస్, ఇన్సూరెన్స్ మరియు ఇతర పత్రాలను అప్‌లోడ్ చేస్తారు. అధికారులు వీటిని పరిశీలించి వెంటనే రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారు. శాశ్వత రిజిస్ట్రేషన్ కార్డు నేరుగా స్పీడ్ పోస్ట్ ద్వారా యజమాని ఇంటికి చేరుతుంది. అయితే.. ఈ సౌకర్యం కేవలం వ్యక్తిగత వాహనాలకే వర్తిస్తుంది. వాణిజ్య వాహనాల రిజిస్ట్రేషన్ మాత్రం పాత పద్ధతిలోనే ఆర్టీఓ కార్యాలయాల్లో జరుగుతుంది.దీంతో రాష్ట్రంలో వాహనదారులకు రవాణా శాఖ భారీ ఊరటనిచ్చింది. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసేవారు రిజిస్ట్రేషన్ కోసం ప్రాంతీయ రవాణా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఈనిర్ణయం తీసుకుంది. శనివారం (జనవరి 24) నుంచి రాష్ట్రవ్యాప్తంగా వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ నేరుగా షోరూమ్‌లలోనే ప్రారంభం అయింది.

వాహన కొనుగోలుదారులు ఎదుర్కొంటున్న వ్యయప్రయాసలను తగ్గించేందుకు రవాణా శాఖ జనవరి 8న ఈ విధానపరమైన నిర్ణయం తీసుకుంది. రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి ఆదేశాల మేరకు ఐటీ అధికారులు కేవలం 15 రోజుల్లోనే దీనికి అవసరమైన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఈ నూతన విధానాన్ని శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని ఒక షోరూమ్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేసి విజయవంతం చేశారు. జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ స్వయంగా హాజరై.. షోరూమ్‌లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పత్రాలను వాహనదారుడికి అందజేశారు. షోరూమ్ వద్దే రిజిస్ట్రేషన్ పూర్తి చేయడానికి ఈ పద్ధతిని అనుసరిస్తారు. ముందుగా.. పత్రాల సేకరణ. వాహనదారుడు వాహనం కొనుగోలు చేసిన వెంటనే.. డీలర్ ఇన్వాయిస్, ఫారం21, ఫారం22, బీమా పత్రాలు, అడ్రస్ ప్రూఫ్ పత్రాలను సిద్ధం చేస్తారు. వీటిలో కొనుగోలుదారుడు ఏదైనా ఫొటో ఐడీ ప్రూఫ్ తో కూడిన అడ్రస్ డాక్యుమెంట్ ఇవ్వాల్సి ఉంటుంది. వాహనం ఫోటోలతో పాటు పైన పేర్కొన్న పత్రాలన్నింటినీ డీలర్ నేరుగా రవాణా శాఖ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆన్‌లైన్‌లో అందిన దరఖాస్తును రవాణా శాఖ అధికారులు వెంటనే పరిశీలించి.. రిజిస్ట్రేషన్ నంబరును కేటాయిస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ నేరుగా స్పీడ్ పోస్ట్ ద్వారా వాహనదారుడి ఇంటి చిరునామాకు చేరుతుంది. ఈ సౌకర్యం కేవలం ద్విచక్ర వాహనాలు, వ్యక్తిగత కార్లకు మాత్రమే వర్తిస్తుంది. లారీలు, బస్సులు వంటి ట్రాన్స్‌పోర్ట్ వాహనాల రిజిస్ట్రేషన్ గతంలో లాగే నేరుగా ఆర్టీఓ కార్యాలయాల్లోనే జరుగుతుంది. ఉదయం కొన్న వాహనాలకు సాయంత్రం లోపు, సాయంత్రం కొన్న వాటికి మరుసటి రోజులోపు శాశ్వత రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ఎప్పుడైనా షోరూమ్‌లలో ఆకస్మిక తనిఖీలు చేసే అవకాశం ఉంది. ఈ విధానం అమలుపై ఇప్పటికే 33 జిల్లాల రవాణా అధికారులకు శిక్షణ ఇచ్చారు. దీనివల్ల మధ్యవర్తుల బెడద తగ్గడమే కాకుండా.. ప్రజలకు ఎంతో సమయం ఆదా అవుతుంది.



# టార్గెట్ ఫిక్స్..?

**మొదటిపేజీ తరువాయి**



స్పందించడం, ఇటు సదరు టీవీ యాజమాన్యాన్ని కాకుండా విలేఖర్లను పోలీసులు అదుపులోకి తీసుకోవడం.. ఆ వేడి చల్లారకముందే, ఆ వార్త వెనుక కారణం ఇదే అంటూ ఇంకో మీడియా మరో వార్తతో ముందుకు రావడం సంచలనంగా మారింది. నేరుగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేరుపెట్టి, "ఆయన శాఖలో కాంట్రాక్టుల వ్యవహారం మీద జరిగిన గొడవే ఓ కథనానికి కారణం" అంటూ ఆ పత్రిక రాసింది. దాన్ని ఖండిస్తూ స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టిన డిప్యూటీ సీఎం భట్టి.. దీని వెనుక ఎవరున్నారో ఆ పత్రిక యజమానితోనే తేల్చుకుంటానని అన్నారు. తాను వైయస్సార్ మనిషిని కాబట్టే అలా రాసి ఉంటారంటూ కొత్త కోణాన్ని తెరపైకి తెచ్చారాయన. తాజాగా అదే మీడియా సంస్థను ఉద్దేశించి.. పెట్టుబడుదారులు, దొంగలు, గద్దలు అంటూ వెనక ఉన్న వారిని హెచ్చరించారు. ఈ విషయంలో విపక్ష నేతలైన హరీష్ రావు, కిషన్ రెడ్డిని డిప్యూటీ సీఎం అభినందించారు. అంతేకాదు.. తాను 40 ఏండ్ల నుంచి నిఖార్సైన రాజకీయం చేస్తున్నానంటూ కొత్తగా పార్టీలో చేరి కీలక పదవుల్లో ఉన్న వారికి పరోక్షంగా చురకలంటించారు.

**ఎవరికి ఎవరు టార్గెట్**

రాష్ట్ర కేబినెట్ లో ఉన్న వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్లే ఎక్కువగా ఉన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి , కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క వంటి వారు పూర్వం నుంచీ కాంగ్రెస్‌లో ఉంటూ అధిష్టానానికి దగ్గరగా ఉండే మంత్రులు కూడా. వారిపై అప్పుడప్పుడు ఏదో ఒక రూపంలో విమర్శలు వస్తూనే ఉన్నాయి. సివిల్ సప్లైస్ వివాదం ఉత్తమ్ పైనా, హిల్ట్ పాలసీ లీక్ వ్యవహారం శ్రీధర్ పైనా, బొగ్గు ఆరోపణలు భట్టిపైనా, వ్యక్తిగత ఆరోపణలు కోమటిరెడ్డిపైనా వచ్చాయి. కేబినెట్ లో సీనియర్ మంత్రుల విషయంలో సీఎం ఆచితూచి వ్యవహరిస్తున్నారనేది రాష్ట్రంలో రాజకీయ విశ్లేషకుల అంచనా. వారి శాఖలను పూర్తిగా వదిలేయకుండా అధికారుల నుంచి సమాచారం తెప్పించుకుంటూ ఏం జరుగుతుందో తెలుసుకుంటూ అవసరం అనుకున్నప్పుడు సీఎం జోక్యం చేసుకుంటున్నారనేది బహిరంగ విమర్శే.

అయితే, కొంతమంది మంత్రుల మీద వచ్చే విమర్శలపై సైలెంట్ గా ఉంటున్నా.. తాజాగా డిప్యూటీ సీఎం స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి, దీని వెనుక ఎవరో ఉన్నారన్నారు. గతంలో దీపాదాస్ మున్షీ మీద, తరువాత మీనాక్షి నటరాజన్ మీద ఒక సెక్షన్ మీడియాలో కథనాలు కూడా వచ్చాయి. ప్రతిపక్షంపై మాట్లాడడం లేదంటూ గతంలో మంత్రుల మీద కూడా విమర్శలు వచ్చాయి.

**పరోక్ష కౌంటర్లు**

ఇటీవల భట్టి చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో దుమారంగా మారుతున్నాయి. తాను 40 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీ పట్టుకుని ఉన్నానని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా పార్టీని వీడలేదంటూ చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో భట్టికి కౌంటర్ ఇస్తున్నట్లుగా అదే ఖమ్మం జిల్లాలో జరిగిన ఓ సభలో సీఎం రేవంత్ కూడా వ్యాఖ్యానించారు. ఎంతోమంది ఏండ్ల నుంచి పార్టీలో ఉన్న కేవలం 17 ఏండ్ల రాజకీయ అనుభవం ఉన్న తనను సీఎం చేశారంటూ సెటైర్లు వేశారు. అంతేకాదు.. వివాదాలు చుట్టుముట్టుతున్న నేపథ్యంలో తమ మంత్రుల జోలికి రావద్దంటూ సీఎం రేవంత్ రెడ్డి మీడియాను హెచ్చరించారు. ''మంత్రులపై ఏం రాసినా ముందు నన్ను సంప్రదించాలి'' అని ఆయన అన్నారు. అయితే, జూబ్లీహిల్స్, పంచాయతీ ఎన్నికల గెలుపు అధిష్టానం దగ్గర రేవంత్ పరపతిని బాగా పెంచిందని, ఆయనకు తిరుగులేనట్టుగా కనిపిస్తోందని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ''మొత్తంగా రేవంత్ బలపడుతున్నారు. కానీ కాంగ్రెస్ బలహీనపడుతోంది. అటు కాంగ్రెస్ అధిష్టానానికి ఈ సీనియర్ మంత్రుల కంటే రేవంత్‌తో పని ఎక్కువ ఉంటుంది'' అని తాజా పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ''తెలంగాణలో తెలుగుదేశం రాజకీయ ఆత్మహత్య చేసుకుంది. బీఆర్ఎస్‌ది కూడా ఒక రకంగా రాజకీయ ఆత్మహత్యే. ఇటువంటి ఘటనలతో ఇప్పుడు కాంగ్రెస్ కూడా రాజకీయ ఆత్మహత్య చేసుకుంటోంది'' అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**సీనియర్ ఐఏఎస్ రిజ్వి వర్సెస్ మంత్రి జూపల్లి**

ఇప్పుడు డిప్యూటీ సీఎం మాత్రమే కాదు.. గతంలో మరికొందరు మంత్రుల చుట్టూ ఇలాంటి ఆరోపణలు, వివాదాలే వినిపించాయ్. సీనియర్ ఐఏఎస్ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య వివాదం అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో కాక పుట్టించింది. రిజ్వి తన ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఆరోపించిన జూపల్లి.. స్వయంగా ఓ లేఖ రాయడం అప్పట్లో కలకలం రేపింది. ఆ తర్వాత ఈ ఎపిసోడ్‌లో ట్విస్టుల మీద ట్విస్టులు కనిపించాయ్. రిజ్వి వీఆర్ఎస్ ఆమోదించొద్దంటూ సీఎస్‌తో పాటు సీఎంకు జూపల్లి మరో లేఖ రాయడంతో విభేదాలను మరింత బహిర్గతం చేసినట్లు అయింది.

ఇక అటు మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు హస్తం పార్టీలో కొద్దిరోజుల కింద క్రియేట్ చేసిన తుఫాన్ అంతా ఇంతా కాదు. మాజీ ఓఎస్డీ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెళ్లినప్పుడు సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయ్. సీఎం రేవంత్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి.. తన తల్లిదండ్రులపై కుట్ర చేస్తున్నారంటూ సుస్మిత ఘాటు విమర్శలు చేశారు. కొండా సురేఖ, మురళికి ఏం జరిగినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దీంతో ఇటు కాంగ్రెస్ పార్టీలో.. అటు అధికారవర్గాల్లో తీవ్ర దుమారం రేగింది. ఈ పరిణామాల మధ్య జరిగిన కేబినెట్ భేటీకి కూడా సురేఖ దూరంగా ఉండడం విభేదాలను మరింత స్ట్రాంగ్ చేసింది. ఆ తర్వాత కొండా సురేఖ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణలు చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. దీనికి ముందు మేడారం అభివృద్ధి టెండర్ల విషయంలో వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటికి.. దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ మధ్య వివాదాలతో.. జరిగిన రచ్చ అంతా ఇంతా కాదు. ఇద్దరు మంత్రుల పంచాయితీ ఢిల్లీ హైకమాండ్ వరకు వెళ్లింది.

**పొంగులేటికి విభేదాలు**

ఇక మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలతో.. మంత్రి పొంగులేటికి విభేదాలు ఎప్పటి నుంచో కొనసాగుతున్నాయ్. చివరికి ఓ ప్రభుత్వ భూమి విషయంలో కోర్టులో పిటిషన్ వేసే వరకు వెళ్లింది పంచాయితీ. ఇలా ఒకదాని తర్వాత ఒకరు వివాదాలు తెరమీదకు వస్తుంటే.. ఒకరి తర్వాత ఒకరిపై వరుసగా ఆరోపణలు వినిపిస్తున్నాయ్. కట్ చేస్తే ఎక్కడో పుట్టిన వివాదం.. రకరకాల మలుపులు తిరిగి.. బొగ్గు గనుల వ్యవహారాన్ని తెరపైకి తెచ్చింది. ఈ వ్యవహారంలో డిప్యూటీ సీఎం భట్టి చుట్టూ ఆరోపణలు వినిపించగా.. సీఎం రేవంత్ సీరియస్‌గా రియాక్ట్ అయ్యారు.

**సీఎంకు అనుకూలత..?**

మరోవైపు, వరుస వివాదాలు, ఆరోపణలు.. ప్రతిపక్షానికి ఆయుధంగా మారితే.. అవే సీఎంకు కూడా అనుకూలతను తీసుకువస్తున్నామయనేది మరో వాదన. దీంతో సీఎం రేవంత్ వీటిపై నజర్ పెంచినట్లు తెలుస్తోంది. ప్రతీ వ్యవహారంపై పూర్తి స్థాయిలో ఆరా తీస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇక అటు మంత్రులపై వచ్చే ఆరోపణలకు వివరణ కావాలంటే.. తనను అడగాలంటూ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు దారి తీస్తోంది.

**ఇప్పుడు భట్టి వంతు**

రాష్ట్ర క్యాబినెట్ లో మీడియా కథనాల వివాదం మంట పుట్టించింది. నిన్నటివరకు ఎన్టీవీ, ఐఏఎస్, మంత్రి, ముఖ్యమంత్రి చుట్టూ తిరిగిన వివాదంలో తాజాగా డిప్యూటీ సీఎం భట్టీ కూడా ఎంట్రీ ఇచ్చారు. ఓ కథనం మీద సీఎం రేవంత్ పై భట్టీ పరోక్షంగా విమర్శలు గుప్పించారు. మీడియా అధినేతకు వాళ్లంటే ప్రేమ అని ఎద్దేవా అని పరోక్ష విమర్శ చేశారు. మొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా సీఎం రేవంత్ .. సైకిల్ మోటర్ పై ఎవరో మహిళతో తిరుగుతున్నారని ప్రచారం జరిగిందంటూ పరోక్షంగా ఆరోపణలు చేశారు. ఇప్పుడు అదే వివాదం కొనసాగుతుండగా.. సీన్ లోకి భట్టీ ఎంటరయ్యాడు. తన మీద వస్తున్న ఆరోపణలపై తీవ్రంగా మండిపడ్డారు. తానేం గాలికి వచ్చిన వాడిని కాదని, 40 ఏండ్లుగా సభ బయట, లోపల పోరాటం చేసి వచ్చానని అన్నారు. దీంతో సీఎం రేవంత్ మీద ఇది పరోక్షంగా విమర్శలు చేసినట్లుగా అధికార పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే భట్టి మళ్లీ విమర్శలకు దిగారు. ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారంటూనే సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేసినట్లు ఆరోపణలు చేశారు. రాబందులు, దోపిడీదారుల కోసం కథనాలు రాశారంటూ ఎవరిని ఉద్దేశించి మాట్లాడారని చర్చ సాగుతోంది. మీడియా అధినేత వెనుక ఎవరి ప్రయోజనాలు ఉన్నాయంటూ కొందరిని ఉద్దేశించి మాట్లాడినట్లుగా తెలుస్తోంది. సదరు మీడియా అధినేత.. ప్రస్తుతం ప్రభుత్వంలోని కీలక నేతతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో భట్టి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.

### మంత్రుల చుట్టూ వివాదాలు.. సీఎంకు అదే బలమా..?

రకరకాల ఆరోపణలు.. రకరకాల వివాదాలు.. రాష్ట్ర మంత్రుల చుట్టూ ఉన్న వివాదాలు సీఎంకు అనుకూలంగా మారుతున్నాయనేది మరో వాదన. జూపల్లి నుంచి ఇప్పుడు భట్టి వరకు.. మంత్రుల చుట్టూ వరుస వివాదాలు కనిపిస్తున్నాయ్. మొన్నటిదాకా మంత్రి కొమటిరెడ్డి వివాదం రాజుకుంటూనే ఉండగా.. ఇప్పుడు ఆ వివాదం కొత్త మలుపు తీసుకుంది. బొగ్గు గనుల వ్యవహారం తెరమీదకు వచ్చింది. మంత్రుల మధ్య విభేదాలకు, లీక్‌లకు కూడా బలమవుతున్నాయి. బొగ్గు బ్లాక్‌ల వ్యవహారమనే గుసగుసలు వినిపించడం.. కథనాలు రావడంపై ఇప్పుడు తెలంగాణలో కొత్త చర్చ మొదలైంది. ఇది అటు తిరిగి.. డిప్యూటీ సీఎం భట్టి టార్గెట్ అయ్యేలా చేసింది. దీంతో ఆయన స్ట్రాంగ్‌గా రియాక్ట్ అయ్యారు. ఆ గనుల కోసం కొత్తగా టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.

ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో భేటీ కానున్న

# కేటీఆర్, హరీశ్

**మొదటిపేజీ తరువాయి**




సమావేశం జరగనున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా కేటీఆర్, హరీశ్ రావులను సిట్ అధికారులు విచారించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సిట్ దర్యాప్తు దూకుడుగా కొనసాగుతుండటంతో, పార్టీ నాయకత్వం కొంత ఒత్తిడిని ఎదుర్కొంటోంది. అంతేకాదు, అవసరమైతే మాజీ సీఎం కేసీఆర్‌కు కూడా సిట్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందన్న చర్చ బీఆర్ఎస్ వర్గాల్లో జరుగుతోంది.

ఈ పరిస్థితుల్లోనే కేసు తాజా పరిణామాలు, సిట్ విచారణలపై పార్టీ తీసుకోవాల్సిన వైఖరి, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై కేసీఆర్‌తో విస్తృతంగా చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు సమాచారం. చట్టపరంగా ఎలా ముందుకెళ్లాలి, రాజకీయంగా ఎలా స్పందించాలి అన్నదానిపై నేతలు అభిప్రాయాలు పంచుకునే అవకాశం ఉంది. మరోవైపు మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ బలోపేతంపై కూడా ఈ సమావేశంలో చర్చ జరగనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, నేతలు, కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజల్లోకి వెళ్లాల్సిన అంశాలపై మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేసే అవకాశముందని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు, మున్సిపల్ ఎన్నికలు... ఈ రెండు కీలక అంశాలు ఈరోజు ఎర్రవల్లి ఫాంహౌస్ సమావేశంలో ప్రధాన అజెండాగా ఉండనున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

# స్టార్టప్ కేంద్రంగానే టీ హబ్..

- **టీ హబ్ ను ప్రత్యేక స్టార్టప్ ల కేంద్రంగానే గుర్తించాలని చెప్పారు**
- **ప్రభుత్వ ఆఫీసులను తరలిస్తున్నారన్న వార్తలపై స్పందించిన రేవంత్ రెడ్డి**
- **అమెరికా పర్యటన నుంచే సీఎస్‌కు ఫోన్ చేసి సూచనలు**
- **టీ హబ్‌లో ఇతర కార్యాలయాలు వద్దని స్పష్టం చేసిన సీఎం**

**హైదరాబాద్, (సిద్దిపేట పవర్):**

టీ హబ్ ను స్టార్టప్ కేంద్రంగా కొనసాగించాలని సీఎం రేవంత్ ఆదేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను టీ హబ్ కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తలపై సీఎం వెంటనే స్పందించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఫోన్ చేసి మాట్లాడారు. టీ హబ్ ను ప్రత్యేక స్టార్టప్ ల కేంద్రంగానే గుర్తించాలని చెప్పారు. ఇంక్యుబేటర్‌గా, ఇన్నోవేషన్ క్యాటలిస్ట్‌గా స్టార్టప్‌లకు కేంద్రంగా ఏర్పాటు చేసిన టీ హబ్ లో ఇతర ఆఫీసులు ఉండకూడదని, అలాంటి ఆలోచనలుంటే విరమించుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ ఆఫీసులను అందుబాటులో ఉన్న ఇతర ప్రభుత్వ భవనాలకు మార్చాలని సూచించారు.



# లీకుల టెన్షన్

- ఫోన్ ట్యాపింగ్ పై అంతా అయోమయం
- అరెస్ట్, నోటీసులు అంటూ లీకులు
- విచారణ కంటే అవే ప్రమాదమంటూ ఆందోళన

హైదరాబాద్, (సిద్దిపేట పవర్):


తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలను కుదిపేస్తోన్న ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు అత్యంత కీలక దశకు చేరుకుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను వేగవంతం చేయడంతో, ఈ వ్యవహారం మాజీ మంత్రుల నుంచి పార్టీ అధినేత వరకు పాకే అవకాశం కనిపిస్తోంది. కేసీఆర్‌కూ నోటీసులు వస్తాయని బీఆర్ఎస్ నేతలు కూడా గట్టిగా భావిస్తున్నారు. అయితే, విచారణలు, నోటీసుల సంగతి ఎలా ఉన్నా.. లీకులతోనే తమకు ప్రమాదంగా మారిందంటూ ఇటు బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజాగా ఇదే విషయాన్ని కేటీఆర్ కూడా ప్రస్తావించారు. ప్రారంభంలో సాధారణ పోలీసు విచారణగా మొదలైన ఈ కేసు, ఉన్నత స్థాయి వ్యక్తుల ప్రమేయం ఉందన్న అనుమానాలతో సజ్జనార్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందానికి బదిలీ అయింది. సున్నితమైన కేసులను ఛేదించడంలో, క్లిష్టమైన విచారణలను జరపడంలో సజ్జనార్‌కు ఉన్న ట్రాక్ రికార్డును పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా విచారణ సాగాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. ఉన్నత స్థాయి నాయకులను ప్రశ్నించే సమయంలో ఎదురయ్యే న్యాయపరమైన, పరిపాలనాపరమైన సవాళ్లను ఎదుర్కోవడానికి సిట్ పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్తోంది.

**హరీష్, కేటీఆర్ విచారణ**

ఇప్పటికే మాజీ మంత్రులు హరీష్ రావు, కేటీఆర్‌లను సిట్ అధికారులు గంటల తరబడి ప్రశ్నించడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ విచారణలు కేవలం ప్రారంభం మాత్రమేనని, త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కూడా నోటీసులు వెళ్తాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. కేటీఆర్ సైతం తన విచారణ అనంతరం మాట్లాడుతూ, ఈ నోటీసుల పరంపర చివరకు కేసీఆర్ వద్దకే చేరుతుందనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ విభాగాన్ని రాజకీయ అవసరాల కోసం వాడుకున్నారనే ప్రధాన ఆరోపణను నిరూపించే దిశగా సిట్ అడుగులు వేస్తోంది.

**లీకులు , వ్యక్తిత్వ హననంపై ఆందోళన**

కేసులు, విచారణల కంటే, దర్యాప్తు సంస్థల నుంచి అందుతున్న లీకుల పట్ల బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విచారణ గదిలో ఏం జరుగుతుందో తెలియకముందే, కొన్ని మీడియా సంస్థల్లో తమకు వ్యతిరేకంగా కథనాలు రావడం వెనుక ప్రభుత్వ ప్రమేయం ఉందని వారు ఆరోపిస్తున్నారు. హీరోయిన్ల ఫోన్ ట్యాపింగ్ వంటి సున్నితమైన అంశాలను లీకుల ద్వారా ప్రచారం చేయడం కేవలం తమ వ్యక్తిత్వ హననానికి ఉద్దేశించినదేనని కేటీఆర్ మండిపడ్డారు. ప్రతి ప్రభుత్వంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఉంటుందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం దానిని అక్రమ ట్యాపింగ్‌గా చిత్రించి విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నేతల వాదన. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ అనే అంశాన్ని ఒక పొలిటికల్ నేరేటివ్‌గా మార్చి, తమ పార్టీని మానసికంగా దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని వారు విశ్లేషిస్తున్నారు.



**కేసీఆర్‌కు నోటీసులు ఇస్తే ఉద్యమం**

తమకు నోటీసులు ఇస్తే సహకరించాం కానీ కేసీఆర్ ను విచారణ పేరుతో వేధిస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. రాజకీయంగా ఈ అంశాన్ని పెద్ద ఇష్యూగా మార్చాలని ప్లాన్ చేసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. అంటే కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిన తర్వాత తెలంగాణ రాజకీయాలు మరింత ఉత్కంఠగా మారనున్నాయి.

---

## సింగరేణి రికార్డులను వెంటనే సీజ్ చేయాలి

- గతంలో సింగరేణిని కేసీఆర్ కుటుంబం దోచుకుందన్న బండి సంజయ్
- ఇప్పుడు కాంగ్రెస్ మంత్రులు అదే పనిలో ఉన్నారని ఆరోపణ
- రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని వ్యాఖ్య



హైదరాబాద్, (సిద్దిపేట పవర్):

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. రెండు పార్టీలూ కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు అదే పనిలో ఉన్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు.

కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే... బీఆర్ఎస్ అవినీతిపై విచారణ జరుపుదామా అని మంత్రి భట్టి విక్రమార్క వ్యాఖ్యానిస్తున్నారని... ఇదంతా చూస్తే రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని అర్థమవుతోందని బండి సంజయ్ అన్నారు. సింగరేణిలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల కేటాయింపులు, దోపిడీపై పూర్తిస్థాయి విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో దోపిడీపై ప్రశ్నిస్తే గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు.

తెలంగాణ సాధన కోసం సింగరేణి కార్మికులు పోరాటాలు చేస్తే... ఉమ్మడి రాష్ట్రంతో పోలిస్తే ఇప్పుడు మరింత ఎక్కువగా గనుల దోపిడీ జరుగుతోందని ఆరోపించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో కాలయాపన చేయకుండా సింగరేణికి సంబంధించిన అన్ని రికార్డులను వెంటనే సీజ్ చేయాలని కోరారు. ఆలస్యం జరిగితే అవి తారుమారు చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ పాలనలో సింగరేణిని అప్పులపాలు చేసి, దోచుకున్న డబ్బుతోనే బీఆర్ఎస్ పార్టీని నడిపించారని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తీసుకొస్తామంటూ హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఆ నిధులను మళ్లించడం పరిపాటిగా మారిందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలేనని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక మేయర్, ఛైర్మన్ స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసుపై కూడా బండి సంజయ్ తీవ్ర విమర్శలు చేశారు. కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతుంటే, అసలు దోషులను సాక్షులుగా ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఫోన్ ట్యాపింగ్ చేసిన అసలు నిందితులను కాపాడుతున్నట్టేనని ఆరోపించారు. సిట్‌పై ప్రభుత్వ ఒత్తిడి ఉంటే దాని విశ్వసనీయత కోల్పోతుందని హెచ్చరించారు. కేటీఆర్ ఇంకా అహంకారంతో మాట్లాడుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ చేయలేదని చెబుతున్న కేసీఆర్, కేటీఆర్ దేవాలయంలో కుటుంబంతో కలిసి ప్రమాణం చేసే ధైర్యం ఉందా? అని సవాల్ విసిరారు. హీరోయిన్లు, వ్యాపారులు, బీఆర్ఎస్ ఎంపీలు, ఎమ్మెల్యేల నంబర్లను కూడా మావోయిస్టుల జాబితాలో పెట్టి ట్యాపింగ్ చేయలేదా? అని నిలదీశారు.

---

## ఆయన వెనక ఎవరో ఉన్నారు

మొదటిపేజీ తరువాయి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణ నిర్ణయాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని తెలిపారు. దీనివల్ల అసలు దోషులు ఎవరో తేలుతుందని భట్టి స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ పరువును బజారుకీడ్చేలా జరుగుతున్న దుష్ప్రచారాలపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పక్కా ప్రణాళిక ప్రకారమే కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం సంస్థపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వాస్తవాలను వెల్లడించారు.

సింగరేణి టెండర్లలో 'సైట్ విజిట్' అనే నిబంధనను ఏదో కొత్తగా చేర్చినట్లు కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో కథనాలు రావడంపై భట్టి స్పష్టత ఇచ్చారు. ఈ నిబంధన వెనుక ఉన్న నిజాలను తెలిపారు. సైట్ విజిట్ నిబంధనను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కోల్ ఇండియా 2018లోనే తన టెండర్ పత్రాలలో పొందుపరిచింది. 2021లో సెంట్రల్ మైనింగ్ కూడా సైట్ విజిట్ తప్పనిసరి అని పేర్కొంది. ఆ సమయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో లేదు. కేవలం సింగరేణిలోనే కాదు.. గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, రైల్వేస్‌కు చెందిన 'రైట్స్', హిందుస్థాన్ కాపర్స్ వంటి కేంద్ర సంస్థల టెండర్లలోనూ ఈ నిబంధన అమల్లో ఉంది.సింగరేణి అనేది తెలంగాణకు గుండెకాయ వంటిదని.. సుమారు 42 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 30 వేల మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీవనోపాధి దీనిపై ఆధారపడి ఉందని డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. అక్రమ రాతల వల్ల కార్మికుల మనోస్థైర్యం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఒక స్వయంప్రతిపత్తి సంస్థ అని.. ఇక్కడ జరిగే ప్రతి నిర్ణయం మంత్రిమండలి వద్దకు రాదని ఆయన స్పష్టం చేశారు. అయినప్పటికీ.. ప్రజల్లో అపోహలు కలగకూడదనే ఉద్దేశంతో నైనీ కోల్ బ్లాక్ టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

**విచారణను స్వాగతిస్తున్నాం..**

ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ రావు లేఖ రాయడం, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విచారణకు ఆదేశించడాన్ని తాము స్వాగతిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. విచారణ జరిగితేనే అసలు నిజాలు బయటకు వస్తాయని.. ఎవరు ఎవరి ప్రయోజనాల కోసం ఇలాంటి కథనాలు వండివారుస్తున్నారో ప్రజలకు తెలుస్తుందని అన్నారు. సింగరేణి ఆస్తులను రాబందుల నుండి కాపాడే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వానికి, రాష్ట్రానికి నష్టం చేసేలా ప్రవర్తించడం సరికాదని విపక్షాలకు హితవు పలికారు.



---

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

## అత్యంత దుర్మార్గం

మొదటిపేజీ తరువాయి

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ప్రభుత్వాలను చూశానని, కానీ ఫోన్ ట్యాపింగ్ వంటి నీచమైన రాజకీయాలను కేవలం కేసీఆర్ హయాంలోనే చూశాం అని మంత్రి జూపల్లి విమర్శించారు. 2021 నుండి తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు వెల్లువెత్తాయని, మాజీ గవర్నర్ తమిళిసై, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి, ఈటల రాజేందర్, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ వంటి వారిపై నిఘా పెట్టారనే అనుమానాలను వారు గతంలో వ్యక్తం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆయన అన్నారు. పోలీసు, ఇంటెలిజెన్స్ వంటి వ్యవస్థలను సొంత పార్టీ నేతలను, ప్రతిపక్ష పార్టీ నేతలను, వ్యాపారవేత్తలను బ్లాక్ మెయిల్ చేయడానికి వాడుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో అర్ధరాత్రి తలుపులు బద్దలు కొట్టి, ప్రొఫెసర్ కోదండరాం వంటి వారిని అక్రమంగా అరెస్ట్ చేసినప్పుడు మీ రాజకీయ విలువలు ఏమయ్యాయని మంత్రి నిలదీశారు. మేము అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపులకు దిగలేదు. ఒకవేళ అదే మా ఉద్దేశమైతే ఎప్పుడో జైలుకు పంపేవాళ్లం. కానీ మేము చట్టాన్ని గౌరవిస్తున్నాం. కేవలం సాక్షిగా సమాచారం అడిగే సీఆర్పీసీ 160 నోటీసు ఇస్తేనే ఇంతలా భయపడిపోవాలా? అని ఆయన ప్రశ్నించారు. సాక్షిగా సిట్ విచారణకు పిలిస్తే, కేటీఆర్ ఎందుకు అంతలా ఆందోళన చెందుతున్నారని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఏ విచారణకైనా సిద్ధం అని ప్రగల్భాలు పలికిన కేటీఆర్, ఇప్పుడు నోటీసులు రాగానే డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో సంబంధం లేకపోతే, నిర్దోషులైతే భయపడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం అత్యంత దుర్మార్గమని, ఇతరుల వ్యక్తిగత జీవితాల్లో తొంగిచూడటం ఏ సంస్కృతిని సూచిస్తుందో బీఆర్ఎస్ నేతలు ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. ఈ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు ఎవరో సిట్ దర్యాప్తులో తేలాల్సి ఉందని, నిజాలు బయటకు రావడం ఖాయమని చెప్పారు. రాజకీయ నాయకులు చట్టానికి అతీతులు కాదని, తప్పు చేసిన వారు ఏ పార్టీ వారైనా శిక్ష అనుభవించాల్సిందేనని అన్నారు. ఈ విచారణలో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారిని కూడా సాక్షులుగా పిలుస్తున్నారని, కేవలం బీఆర్ఎస్ నేతలనే టార్గెట్ చేస్తున్నట్లు మాట్లాడటం సరికాదన్నారు.చట్టబద్ధ సంస్థలపై బురద జల్లే ప్రయత్నాలను ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు చేసిన వారు ఏ పార్టీ వారైనా సరే శిక్ష అనుభవించాల్సిందేనని తేల్చి చెప్పారు.మిగులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, అవినీతి, కుటుంబ పాలనతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన బీఆర్ఎస్ నేతలను ప్రజలు ఎప్పుడో విస్మరించారని మంత్రి అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్, హరీష్‌రావు తమపై పడ్డ బట్ట కాల్చి ఇతరుల మీద వేసే పనులు మానుకోవాలని హితవు పలికారు.

---

నేను వ్యక్తిగత దూషణలు చేయను...

## చిల్లర భాషను వాడను

మొదటిపేజీ తరువాయి



ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రతీకార చర్యేనని ఆరోపించారు. ప్రభుత్వ హెచ్చరికలకు, నోటీసులకు భయపడేది లేదని, తన వద్ద ఉన్న ఆధారాలతోనే సిట్‌కు సమాధానం ఇస్తానని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తమ పార్టీ సీనియర్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులకు సంబంధం లేకున్నా సిట్ వేధిస్తోందని శుక్రవారం మీడియా సమావేశంలో విమర్శించినట్లు ఆయన గుర్తుచేశారు. ఆ ప్రెస్ మీట్ ముగిసిన 12 గంటల్లోపే, శుక్రవారం అర్ధరాత్రి 12 గంటలకు సిట్ పోలీసులు తన ఇంటికి వచ్చి నోటీసులు ఇచ్చారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. రెండు రోజుల్లో ఆధారాలతో సమాధానం ఇవ్వాలని, లేకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం ప్రతిపక్ష నేతగా తన హక్కు అని, ఇలాంటి వార్నింగులకు భయపడనని తేల్చిచెప్పారు.

సిట్ చీఫ్ సజ్జనార్‌పై తాను వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, ఆయనపై ఏపీలో నమోదైన కేసులపై సిట్ వేయాలని డిమాండ్ చేసినట్లు నోటీసులో పేర్కొనడం వాస్తవ విరుద్ధమని అన్నారు. "నేను వ్యక్తిగత దూషణలు చేయను... చిల్లర భాషను వాడను. 2015లో ఓటుకు నోటు కేసు సమయంలో నాటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి కెమెరాకు అడ్డంగా దొరికారు. ఆ తర్వాత ఏపీ నేతల ఫోన్లు ట్యాప్ చేశారని తెలంగాణ ఇంటెలిజెన్స్ అధికారులపై కేసులు నమోదయ్యాయి. ఆ సమయంలో సజ్జనార్ కూడా ఇంటెలిజెన్స్ విభాగంలో అధికారిగా పనిచేశారు. అందుకే, ఇప్పుడు ఆయనే ఈ ట్యాపింగ్ కేసు దర్యాప్తుకు నేతృత్వం వహించడం నైతికంగా సరైంది కాదని మాత్రమే నా అభిప్రాయం చెప్పాను. ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు" అని తన వ్యాఖ్యలను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమర్థించుకున్నారు. ప్రభుత్వం తమపై కక్ష సాధిస్తోందని, బీఆర్ఎస్ నేతలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న బొగ్గు కుంభకోణం వంటివాటిపై సిట్ ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. కేవలం ప్రభాకర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు, కింది స్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేయడం అన్యాయమని అన్నారు. బీఆర్ఎస్ నేతలకు మాత్రమే ఆగమేఘాల మీద నోటీసులు రావడం, దర్యాప్తు వివరాలు మీడియాకు లీక్ కావడం, కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లో లైవ్ కామెంటరీలు ఇవ్వడం చూస్తుంటే ఇదంతా రాజకీయ కుట్ర అని స్పష్టమవుతోందని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ప్రభుత్వ అణచివేతకు వ్యతిరేకంగా తమ పోరాటం ఆగదని ఆయన హెచ్చరించారు.

---

## నైనీ టెండర్ రద్దు చేశారంటే.. స్కాం జరిగినట్టే కదా?

మొదటిపేజీ తరువాయి

ఎందుకు వహిస్తున్నారని ఆరోపించారు.

రేవంత్ రెడ్డి బావమరిది కోసమే ఈ తతంగమం తానని విమర్శించారు. బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని సూటిగా చెప్పలేక, విషయాలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. నైనీ టెండర్ రద్దు చేయడమే అవినీతికి నిదర్శనమని, అదే తరహాలో పిలిచిన మిగిలిన టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

బొగ్గు కుంభకోణంలో అవినీతి జరగలేదని చెప్పకుండా బీటింగ్ అరౌండ్ ద బుష్ లా ఏదో చెప్పి, మసిబూసి మారేడు కాయ చేసారు. మీరెన్ని సాకులు చెప్పినా మీ కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరిగింది నిజం. అందులో రేవంత్ రెడ్డి బామ్మర్ది రింగ్ మెన్ గా పాత్ర పోషించింది నిజం. నేను సూటిగా అడుగుతున్నా. ఏ స్కాం జరగకుంటే నైనీ టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ప్రకటించారు?

శనివారం బయటపెట్టిన మరో కుంభకోణం.. సోలార్ పవర్ స్కాం గురించి ఎందుకు ఒక్క మాట కూడా ప్రెస్ మీట్ లో మాట్లాడలేదని నిలదీశారు. నైనీని రద్దు చేసినట్లే మిగతా అన్ని టెండర్లను ఎందుకు రద్దు చేయడం లేదు? సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధనను బిఆర్ఎస్ మీద నెట్టే ప్రయత్నం చేయడం వల్ల నిజాలు అబద్దాలు అయిపోవు. జరిగిన స్కాంలు, స్కీంలుగా మారిపోవని స్పష్టం చేశారు.

**రేవంత్‌రెడ్డి, బావమరిది కుంభకోణంపై విచారణకు హామీ ఇస్తే లేఖ రాస్తా**

సైట్ విజిట్ నిబంధనను 2018లోనే మొదలైందని చెప్పి, దానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలను ఉదాహరణలుగా చెప్పి ఏం చెప్పదలుచుకున్నారు? అది తప్పు కాకుంటే నైనీ ఎందుకు రద్దు చేసినట్లు? ఇదే సైట్ విజిట్ విధానం సింగరేణిలో కూడా అమలు చేసామని ఇప్పటికైనా ఒప్పుకున్నందుకు ధన్యవాదాలని అన్నారు.

భట్టి గారూ. మీరంటే నాకు చాలా గౌరవం. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తిపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జీ లేదా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సీబీఐ మాత్రమే చేయగలవు అన్న ఉద్దేశ్యంతోనే లేఖ రాసాను. మీరు నిజంగా రేవంత్ రెడ్డి, అతని బావమరిది కుంభకోణం మీద నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తాను అని హామీ ఇస్తే మీకూ లేఖ రాయడానికి సిద్ధమని హరీష్‌రావు స్పష్టం చేశారు.



# అందరి బాగోతాలను బయటపెడతాం

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహిస్తామని ప్రకటించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు.

**ప్రాథమిక విచారణలోనే రూ. 4 కోట్ల అవినీతి**

ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి 35వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు కమిటీ గుర్తించిందని మంత్రి తెలిపారు. విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి రూ. 4 కోట్లు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు వివరించారని తెలిపారు. గత ప్రభుత్వం ముందుచూపు లేకుండా అనాలోచితంగా, కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడ్డారన్నారు. వీటిపై ఆరోపణలు రావడంతో భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు రూ. వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు రూ. పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు.

**నేడు సర్వేయర్లకు లైసెన్స్‌లు**

ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయగా నేడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో మరో రెండు వేల మందికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డీఐజీ ఎమ్. సుభాషిని, సీఎమ్ఆర్‌వో మకరంద్, ఏసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ పాల్గొన్నారు.



# హమాల్ బస్తీ అంగన్వాడి సెంటర్ లో ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ

**సికింద్రాబాద్, జనవరి 24 ( సిద్దిపేట పవర్ ):**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని హమాల్ బస్తీ2 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఎన్జీవో ఆధ్వర్యంలో పీ & జీ సంస్థ సహకారంతో శనివారం ప్రీ స్కూల్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి సీడీపీఓ డా. స్వప్న, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు వనిత, ఐసీడీఎస్ సూపర్వైజర్ వి. జాహ్నవి హాజరయ్యారు. ప్రథమ్ కోఆర్డినేటర్ లలిత, మాస్టర్ ట్రైనర్లు మహేశ్వరి, నవనీత, అంగన్వాడి టీచర్ కులుసుం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి నెల నిర్వహించే ఈసీసీఈ (ECCE) డే కార్యక్రమాన్ని కూడా ఈ సందర్భంగా విజయవంతంగా నిర్వహించారు. చిన్నారులకు ప్రాథమిక విద్యపై అవగాహన పెంపొందించడంలో ఈ కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వక్తలు తెలిపారు.




# కంటోన్మెంట్ విలీన పోరాటానికి భారీ స్పందన

- **శ్రీగణేశ్ దీక్షకు సంఘీభావం తెలిపిన ఎంపీ,ఎమ్మెల్సీలు**

**సికింద్రాబాద్, జనవరి 24 ( సిద్దిపేట పవర్ ):**

కంటోన్మెంట్ ప్రజలపై కేంద్ర ప్రభుత్వం రుద్దుతున్న నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేసి, కంటోన్మెంట్ బోర్డును వెంటనే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలనే డిమాండ్‌తో ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన రిలే నిరహార దీక్షకు భారీ మద్దతు లభిస్తోంది.శనివారం 5వ రోజున దీక్షా శిబిరాన్ని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలు సందర్శించి ఆశీర్వచనం అందజేస్తూ సంఘీభావం తెలిపారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ దీక్షా శిబిరానికి వచ్చి శ్రీగణేష్ పోరాటానికి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఈ దీక్ష వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, కంటోన్మెంట్ ప్రజల అభివృద్ధి, కేంద్ర నియంత్రణ నుంచి విముక్తి కోసమే జరుగుతోందని తెలిపారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైన కంటోన్మెంట్ బోర్డుకు ప్రత్యామ్నాయంగా విలీనమే ఏకైక పరిష్కారమని స్పష్టం చేశారు.యంపీ ఈటెల రాజేందర్ వెంటనే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి విలీన ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులు అనీల్ కుమార్ యాదవ్ ఈ అంశాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లి పార్లమెంట్‌లో ప్రస్తావిస్తామని తెలిపారు. అవసరమైతే ఢిల్లీలో ధర్నాకు సిద్ధమని ప్రకటించారు.వికాస్ మంచ్, రసూల్‌పుర క్రిస్టియన్ చర్చ్ ఫాదర్లు, ముస్లిం పెద్దలు, బోయిన్‌పల్లి మార్కెట్ హమాలీ సంఘం, మార్కెట్ కమిషన్ ఏజెంట్స్ అసోసియేషన్, బొల్లారం కైలాస్ గూడ వాసులు, వార్డు 5 కాలనీల సంఘాలు, మహిళలు, బస్తీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



# చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యమే

- **తిగుల్ గ్రామ సర్పంచ్ రజిత**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి:**

విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం పేర్కొన్నారు. శనివారం జగదేవపూర్ మండలం తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐకేఏస్ కెరీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఉన్న ప్రతి విద్యార్థికి వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలో ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంతో మంది విద్యార్థులు ఉపవాసంతో పాఠశాలలకు వచ్చి అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యమే ముఖ్యంగా పాఠశాలకు రావడం మంచిదన్నారు. ఉదయం తప్పకుండా విద్యార్థులు భోజనం చేసి పాఠశాలకు రావాలని కోరారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారని వివరించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రతిభకు పదును పెట్టి పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందుతుందని విద్యార్థులు ఇటు పాఠశాల అటు ఇంటి భోజనాన్ని కాకుండా ఆరు బయట లభించే భోజనాన్ని తీసుకోవడం వలన అనారోగ్యం పాడిన పడతారని వివరించారు. ఫౌండేషన్ ద్వారా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం హర్షనియమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు, వైద్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# దండోరా లాంటి సినిమా సమాజానికి అవసరం

- **సమాజంలో కుల వివక్షతను రూపుమాపాలి..**




మనదేశంలో ఏదిక్కు తిరిగినా మనకు ఎదురొచ్చే భూతం కులమని మహనీయులు తెలియజేశారు. అది కాస్త భూతం అనే స్థాయిని దాటి మన భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పరిస్థితిలోకి దక్షిణాది రాష్ట్రాల్లో నేటికి కుల హత్యలు, కులం కారణంగా జరిగే ఆత్మహత్యలు అత్యధికంగా పెరుగుతున్నాయి. ఇంకా కులం ఎక్కడిది అంటారు కానీ కళ్ళ ముందున్న అంటరానితనం అసమానతలు వాటి కొరకు పాటు పడేవారు కొంతమంది అయినా మచ్చుకే లేరు. ఇప్పుడున్న మన తెలుగు రాష్ట్రాల్లో ఇవన్నీ సహజంగానే సాగుతున్నాయి. వీడికి ఎంతో కొంత అడ్డుకట్ట వేసే దిశగా వినోదాత్మకంగా సినిమా రూపంలో తమిళనాడు తరహాలో మన తెలుగు ఇండస్ట్రీలో సామాజిక అంశాలు ప్రజలందరికీ అద్దం పట్టేలా చలనచిత్రాల రూపంలో రావడం సంతోషకరం. అలాంటి అద్భుతమైన దృశ్య కావ్యాల్లో నేటిది దండోరా ఒకటి. నేటి మన పరిస్థితులను అనువహించుకొని కులం అనేది ఎంత ప్రమాదకరమో దాని వల్ల జరిగే లాభం కంటే నష్టం ఏ స్థాయిలో ఉంటుందని, అవసరమైతే ప్రాణాలను సైతం బలి కొనేలా తీసుకుంటుందని చూపించే విధానం హర్షించదగినది. అలాంటి కులం అనే అంశాన్ని నిర్మూలించే పనిలో ఈ సినిమా బాగా స్వామ్యం అవ్వడం చాలా సంతోషకరమైన విషయం దీని ఆదర్శంగా తీసుకొని నేటి యువత కుల రహిత సమాజం కోసం కృషి చేస్తే రాబోయే రోజుల్లో అద్భుతమైన ఫలితాలను మన పిల్లలు చూసే అవకాశం ఉంది. తెలంగాణలో మరీ ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి సామాజిక అంశాల ఆధారంగా మరెన్నో సినిమాలు తెరమీదకి వచ్చి మనుషుల్లో కులం కంపెనీ రొంపుని రూపుమాపేలా చేసే చేయాలని ఆశిస్తూ. ఈ సినిమాలో ముఖ్య పాత్రలు నటన పాటలు స్క్రీన్ మీద దర్శకత్వం అంతా ఊహకందని విధంగా తీర్చిదిద్దడం ఒక సాహసం అనే చెప్పాలి.



# ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కొమ్మూరి

- **ప్రజాపాలనలో సొంతింటి కలను నిజం చేసింది కాంగ్రెస్ పార్టీ యే**

**చేర్యాల, జనవరి 24 (సిద్దిపేట పవర్)**

ప్రజాప్రభుత్వంలో సొంతింటి కలను నిజం చేసింది కాంగ్రెస్ పార్టీ యే నని జనగామ నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు..శనివారం చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభించిన ఆయన, అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇండ్లను కట్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది అని తెలిపారు..ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి నీ శాలువాతో సత్కరించి, ధన్యవాదాలు తెలిపారు.. కార్యక్రమంలో ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి, గ్రామ అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు బోయిని రాజు, యువజన నాయకులు భూమని బాలరాజు,గడ్డం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..



# ఇటిక్యాల ప్రైమరి పాఠశాలలో ఘనంగా బాలికల దినోత్సవం

- **సర్పంచ్ దిన రాజలింగం**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండల పరిధిలో ఇటిక్యాల గ్రామంలో లో అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఇటిక్యాల ప్రైమరీ స్కూల్ లో ఫుడ్ ఫెస్టివల్ ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గా సర్పంచ్ దీన రాజలింగం ఉప సర్పంచ్ ఎర్రోళ్ల నరేష్ మాట్లాడుతు మహిళాల యొక్క శక్తిని ప్రపంచానికి చూపించిన వీర వనితలుగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శంకర్ సార్ కార్యదర్శి రేఖ తదితరులు పాల్గొన్నారు.



# రైతులు పశువుల ఉచిత వైద్యాని సద్వినియోగం చేసుకోవాలి

- **మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్వేతా**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండల పరిధిలోని ఇటిక్యాల గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ శ్వేత ఉచిత పశు వైద్య శిబిరంఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా సర్పంచ్ దిన రాజలింగం హాజరై వారి చేతుల మీదుగా గొర్రెలకు మందు వేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, గర్భనిర్ధారణ పరీక్షలు, ఎద సూదులు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, గోపాల మిత్రలు కనుకయ్య,గౌరయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.





# వనదేవతలు సమ్మక్క–సారలమ్మను దర్శించుకున్న డా. కోట నీలిమ

**సికింద్రాబాద్, జనవరి 24 ( సిద్దిపేట పవర్ ):**

మేడారం వనదేవతలు శ్రీ సమ్మక్క-సారలమ్మలను పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ కాంగ్రెస్ ఇంచార్జి డా. కోట నీలిమ శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లకు బంగారం సమర్పించారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో గద్దెలు, ప్రాంగణ అభివృద్ధి పనులు భక్తులకు మరింత సౌకర్యంగా మారాయని తెలిపారు. రాష్ట్ర ప్రజల శాంతి, సమృద్ధి కోసం వనదేవతలను ప్రార్థించినట్లు డా.కోట నీలిమ చెప్పారు.



# రాష్ట్ర గోపాలమిత్ర అధ్యక్షుడిగా సింగం రాజు ఏకగ్రీవ ఎన్నిక



**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతిని-ధి :**

తెలంగాణ రాష్ట్ర గోపాలమిత్ర అధ్యక్షుడిగా సింగం రాజు యాదవ్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు గోపాలమిత్ర అధ్యక్షుడు సింగం రాజు మాట్లాడుతూ గోపాలమిత్ర సభ్యులను కాంగ్రెస్ గవర్నమెంట్ రెగ్యులరైజ్ చేయాలని ఇంతకు ముందు ఒక లక్ష రూపాయలు ఇన్సూరెన్స్ ఉంది. దానిని ఐదు లక్షల వరకు పెంచాలని వారు విన్నవించుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి జి మల్లేష్ యాదవ్ గౌరవ అధ్యక్షులు శ్రీరాములు, మరియు చెరుకు శ్రీనివాస్ ఉపాధ్యక్షులు వెంకన్న, బొడ్డు కృష్ణ, రాఘవరెడ్డి, సిద్దిపేట గోపాలమిత్ర జిల్లా సభ్యులు ఉప కార్యదర్శి గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# విబిజిరామ్జి చట్టాన్ని కొనసాగించాలి


- **మైలారం గ్రామ ఉపాధి కూలీల డిమాండ్.**
- **ఉపాధి కూలీలకు విబిజిరాంజీ చట్టం గూర్చి వివరిస్తున్న బిజెపి నాయకులు**



**గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**

మండలంలోని మైలారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వీబీ గ్రామ జి చట్టాన్ని 100 నుండి 125 రోజులకు పొడగించినందుకు ఉపాధి కూలీలు హర్షం వక్త్యం చేశారని బీజేపీ వర్గల్ మండల్ అధ్యక్షులు బొల్లిపల్లి తిరుపతి రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారం చేస్తున్నారు అని వీబీజీ రామ్ జి. చట్టాన్ని ఉపాధి హామీ కార్మికులకు ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. మహాత్మా గాంధీ కలలు కన్న రామ రాజ్యం కాంగ్రెస్‌కు నచ్చడం లేదని, గాంధీజీ సమాధిపై ఉన్న "హే రామ్" అనే మాట కూడా వారికి ఇష్టం లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం సంకుచితంగా మారిందని విమర్శించారు. సమాజంలో మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతోనే 'వీబీజీ రామ్ జీ' అనే పేరు పెట్టామని తెలిపారు.ఈ బుటక ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ వాళ్ళు మార్చుకుని ఆరోపణలు కాకుండా అభివృద్ధికి తోడ్పడాలి అని అన్నారు . మనకు ఎప్పుడు అన్నగా ఏ ఆపద వచ్చిన మన మెదక్ పార్లమెంట్ వర్యులు మాధవనేని రఘునందన్ రావు ఉన్నారని చెప్పారు.ఈ కార్యక్రమానికి మండల మాజీ ఉపాధ్యక్షులు ఎర్రవాడ ప్రవీణ్ గ్రామ బూత్ అధ్యక్షులు నర్ర రవి, లింగ నరేష్ లింగ భాను దండు విఠల్ ,గడ్డం హరీష్,కనకయ్య గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పలుగు గడ్డలో తెలంగాణ రాజ్యాధికారం గ్రామ కమిటీ ఎన్నిక



**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**

జగదేవపూర్ మండల పరిధిలోనీ పలుగు గడ్డ గ్రామం లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ మండల అధ్యక్షులు గడ్డం సురేందర్, జిల్లా ఉప అధ్యక్షులు నర్సింగ్,సయ్యద్ బాబా మైనార్టీ జిల్లా అధ్యక్షుల రాయపోల్ మండల అధ్యక్షులు కనకయ్య ఆధ్వర్యంలో గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. పలుగు గడ్డ గ్రామ అధ్యక్షుడు గా గువ్వ కనక రాజు ఉప అధ్యక్షులుగా నర్ర అర్జున్, ప్రధాన కార్యదర్శి అరుముల్ల నరేష్, అధికార ప్రతినిధి లోకుల సాయిరాం,గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల సురేష్,సెక్రెటరీ అరుముల్ల ప్రసాద్ కుమార్ సహాయ కార్యదర్శి తన్నీరు ఆనంద్, పలుగు గడ్డ గ్రామ యూత్ అధ్యక్షులు నర్ర కరుణాకర్ యూత్ ఉప అధ్యక్షులు నాగపురి ప్రవీణ్ కుమార్, కోశాధికారి లింగాల నితిన్,ప్రచార కార్యదర్శి దేవుని గణేష్, కార్యవర్గ సభ్యులు నర్ర శ్రీకాంత్,కుక్కల సాయి కుమార్,నర్ర కిరణ్,పిట్టల నవీన్,తన్నీరు ఆంజనేయులు,నాగపురి సుదర్శన్,నర్ర గణేష్, లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షులు గడ్డం సురేందర్ మాట్లాడుతూ బీసీల తలరాత మార్చడానికి తీన్మార్ మల్లన్న "తెలంగాణ రాజ్యాధికార పార్టీ " స్థాపించారని పేర్కొన్నారు. పార్టీకి సంస్థగతంగా బలమైన పునాదులు వేసేందుకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.జగదేవపూర్ మండలంలోని పలుగడ్డ గ్రామంలో మొదటి నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు కమిటీ అధ్యక్షుల కు కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాజాధికారం పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజాధికార పార్టీ మండల పార్కింగ్ ప్రెసిడెంట్ పిట్టల లక్ష్మణ్, మండల నాయకులు హరీష్,రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టంతో చదవాలి

- **సర్పంచ్ శ్రీవాణి హనుమంత్**
- **మెతుకు లక్ష్మణ్,మంద రవి ఆధ్వర్యంలో డ్రెస్ మెటీరియల్ అందజేత**


**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**


విద్యార్థులు ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సర్పంచ్ శ్రీవాణి హనుమంత్ అన్నారు శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో మెతుకు లక్ష్మణ్, మంద రవి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ బూట్లు, డ్రెస్ మెటీరియల్,బుక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ శ్రీవాణి హనుమంత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెదలాలని, ఇష్టంతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరుకుంటూ విద్యార్థులకు చేయుతగా డ్రెస్ మెటీరియల్ అందజేసిన లక్ష్మణ్, రవిని అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రఫియా,గజ్వేల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరి రామాగౌడ్ రాజు ,ప్రసాద్, గౌలికర్ రాజు వెంకటేష్ యాదవ్ రవి నర్సింలు రాఖీ బుడిగే లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.




# సాగు నీళ్లకోసం రైతుల ఎదురుచూపులు

- **యాసంగి పంట కు నీళ్లు వస్తాయా రావా అనే ఆందోళన లో ఉమ్మడి జిల్లా రైతులు..**
- **తక్షణమే నీటి విడుదల చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**
- **ఉమ్మడి మెదక్ జిల్లా రైతుల పక్షాన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి లేఖ వ్రాసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**





T. HARISH RAO
M.L.A.,
33-Siddipet Assembly Constituency &
Deputy Floor Leader, BRSLP

Hyderabad Office :
Flat No. 805,
MS-III Block, OLD MLA Quarters
Hyderguda, Hyderabad - 500029.
Contact No. 040-23114222,
Cell : 94404 71409
E-mail : harishrao1116@gmail.com

శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు,
తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రివర్యులు.

నమస్కాములు,

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఉమ్మడి జిల్లాలో సాగు, త్రాగు నీటి కి నోచుకోలేదు. తెలంగాణ వచ్చాక కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లా లో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ ల నిర్మాణాలను చేపట్టారు. ఈ రిజర్వాయర్ ల ద్వారా వరుసగా గత ఆరు సంవత్సరాలు జిల్లాలోని రైతుంగానికి గోదావరి జలాలు అందిందాము. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన నాలుగు ప్రాజెక్టు ల ద్వారా ఐదు (5) జిల్లాలు సిద్దిపేట, మెదక్, యాదాద్రి, జనగామ మరియు సిరిసిల్ల లకు సాగు త్రాగు నీరు అందిందాము. గత సంవత్సరం యాసంగి పంటకు కాళేశ్వరం జలాలతో నాలుగు ప్రాజెక్టు ల ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగ కలిపి 3 లక్షల ఎకరాల పంట పండిందని గుర్తు చేస్తున్నాను. ఈ సంవత్సరం కూడ యదావిదిగా సాగు నీరు అందించడానికి నీటి ప్రణాళిక కమిటీ ని ఆదేశించగలరని మిమ్మల్ని కోరుతున్నాను.

ఇప్పటికే యాసంగికి రైతులు నాట్లు వేసుకొని నీళ్ళ కోసం ఎదురు చూస్తున్న నేపథ్యం లో ప్రభుత్వం తరుపున నీటి విడుదల కై భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాను.. రైతు ప్రయోజనాల దృష్ట్యా కాలువల ద్వారా పంట పొలాలకు నీళ్ళు అందించాలి. అదేవిదంగా గతం లో మాదిరిగా ఈ ప్రాజెక్టు ల ద్వారా చెరువు లు, కుంటలు చెక్ డ్యామ్ లతో భూగర్భ జలాలు పెరిగేవి, ఈ సంవత్సరం కూడా చెరువు లకు, కుంటలకు,చెక్ డ్యామ్ లకు కాలువల ద్వారా నీటిని విడుదల చేసి భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయగలరు.ఈ సందర్భంగా నీటి విడుదల పై ఇరిగేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ప్రభుత్వం తరుపున ఉమ్మడి జిల్లా రైతాంగానికి తక్షణమే నీళ్లు విడుదల చేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాను.

With regards.

కృతజ్ఞతలతో..

తన్నీరు హరీష్ రావు

**సిద్దిపేట పవర్ నంగునూరు జనవరి 24**

ఉమ్మడి మెదక్ జిల్లా రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ వ్రాసారు.. ఈ సందర్భంగా స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి ఉమ్మడి జిల్లాలో సాగు, త్రాగు నీటి కి నోచుకోలేదని తెలంగాణ వచ్చాక కెసిఆర్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లా లో కాళేశ్వరం ప్రాజెక్ట్ లో భాగంగా అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ ల నిర్మాణాలను చేపట్టారని లేఖలో పేర్కొన్నారు.. ఈ రిజర్వాయర్ ల ద్వారా వరుసగా గత ఆరు సంవత్సరాలుగా జిల్లాలోని రైతుంగానికి గోదావరి జలాలు అందించామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగమైన నాలుగు ప్రాజెక్టు ల ద్వారా ఐదు (5) జిల్లాలు సిద్దిపేట, మెదక్, యాదాద్రి, జనగామ సిరిసిల్ల లకు సాగు త్రాగు నీరు అందించామని చెప్పారు.గత సంవత్సరం యాసంగి పంటకు కాళేశ్వరం జలాలతో నాలుగు ప్రాజెక్టు ల ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగ కలిపి 3 లక్షల ఎకరాల పంట పండిందని గుర్తు చేస్తున్నానని తెలిపారు. ఈ సంవత్సరం కూడ యధావిధిగా సాగు నీరు అందించడానికి నీటి ప్రణాళిక కమిటీ ని ఆదేశించగలరని లేఖ ద్వారా మిమ్మల్ని కోరుతున్నానన్నారు.ఇప్పటికే యాసంగికి రైతులు నాట్లు వేసుకొని నీళ్ళ కోసం ఎదురు చూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం తరుపున నీటి విడుదల కై భరోసా ఇవ్వాలని చెప్పారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కాలువల ద్వారా పంట పొలాలకు నీళ్ళు అందించాలి. అదేవిదంగా గతం లో మాదిరిగా ఈ ప్రాజెక్టు ల ద్వారా చెరువు లు, కుంటలు చెక్ డ్యామ్ లతో భూగర్భ జలాలు పెరిగేవి, ఈ సంవత్సరం కూడా చెరువు లకు, కుంటలకు,చెక్ డ్యామ్ లకు కాలువల ద్వారా నీటిని విడుదల చేసి భూగర్భ జలాలు పెంచేందుకు కృషి చేయగలరన్నారు..ఈ సందర్భంగా నీటి విడుదల పై ఇరిగేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ప్రభుత్వం తరుపున ఉమ్మడి జిల్లా రైతాంగానికి తక్షణమే నీళ్లు విడుదల చేయాలని రైతుల పక్షాన లేఖ ద్వారా ప్రభుత్వాన్ని హరీష్ రావు డిమాండ్ చేసారు

# మేడారంలో తాత్కాలిక ఆర్.టి.సి. బస్టాండ్ ప్రారంభం.

- **భక్తులు, ప్రజలకు శాశ్వత రవాణా సౌకర్యాలే లక్ష్యం :**
- **రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**
- **మేడారం జాతర–2026కు చారిత్రాత్మక రవాణా మౌలిక వసతులు.**







**తాడ్వాయి,జనవరి24(సిద్దిపేట పవర్):**

మహాజాతర-2026 ఏర్పాట్లలో భాగంగా మేడారంలో రవాణా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను ప్రకటిస్తూ,రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,మేడారాన్నిసందర్శించి తాత్కాలిక ఆర్.టి.సి. బస్టాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, మేడారం జాతరకు భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో 4,000ఆర్.టి. సి. బస్సులను ప్రణాళికబద్ధంగా నడుపుతున్నామని, అవసరాన్ని బట్టి మరిన్ని బస్సులు కూడా వెంటనే పెంచే విధంగా శాఖ సిద్ధంగా ఉందన్నారు. ఈ ఏర్పాట్ల కోసం రవాణా శాఖ తరపున వందలాది మంది అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి, జాతర ప్రయాణ సేవలను అధికారికంగా ప్రారంభించినట్లు తెలిపారు.జాతర ప్రయాణ సేవలు జనవరి 20 నుంచి ఫిబ్రవరి 1వరకు నిరంతరంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కాలవ్యవధిలో ప్రయాణికులకు రవాణా సేవలతో పాటు భద్రత, ఆరోగ్య సహాయం వంటి అంశాల్లో కూడా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సహా ఆర్టీసీ ఉన్నతాధికారులు జాతర విజయవంతానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.భక్తులు తమ ప్రయాణాన్ని సురక్షితంగా, సౌకర్యవంతంగా పూర్తి చేసుకోవాలంటే తప్పనిసరిగా RTC బస్సులనే వినియోగించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. స్వంత వాహనాలతో వస్తే దూరంగా పార్కింగ్,ఎక్కువ నడక వంటి ఇబ్బందులు తప్పవని, RTC బస్సులు గద్దెలకు సమీపంలోనే దించుతాయని తెలిపారు. ఆర్టీసీ ప్రయాణం భద్రతాపరంగా మరింత నమ్మదగినదని అన్నారు. జాతర సమయంలో చిన్న పిల్లలు తప్పిపోయే ఘటనలను నివారించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న చైల్డ్ ట్రాకింగ్ సిస్టమ్‌ను ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని మంత్రులు కోరారు. ఈ విధానం ద్వారా తప్పిపోయిన పిల్లలను వేగంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, 2024లోనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం జాతరకు రవాణా మౌలిక వసతులు కల్పించాలనే దూరదృష్టితో ముందడుగు వేశారని గుర్తు చేశారు. ప్రతి జాతర సమయంలో తాత్కాలిక ఏర్పాట్లతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, దీర్ఘకాలిక పరిష్కారంగా శాశ్వత ఆర్.టి.సి. బస్టాండ్‌ను ఏర్పాటు కు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ఏడాది జాతర సందర్భంగా అధిక సంఖ్యలో RTC బస్సులు ఏర్పాటు చేయడమే కాకుండా, ఈసారి మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా మేడారానికి వచ్చి రవాణా ఏర్పాట్లను పరిశీలించారని, ఇందుకు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు, ప్రయాణికులు ఎలాంటి అసౌకర్యాలు ఎదుర్కోకుండా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో సంవత్సరాల తరబడి బస్ డిపో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వెంటనే స్పందించి దాదాపు రూ.5 కోట్ల వ్యయంతో శాశ్వత బస్‌డిపో ను మంజూరు చేసినందుకు రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంత్రి సీతక్క ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బస్ డిపో అంశంపై మంత్రి సీతక్క వివరిస్తూ, రూ.7 కోట్ల వ్యయంతో ఏటూరునాగారంలో RTC బస్ డిపోను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఏటూరునాగారంలో డిపో ఏర్పాటు చేస్తే అటవీ ప్రాంతాలు, భద్రాచలం, మంగపేట, వాజేడు, వెంకటాపురం వంటి ప్రాంతాలన్నీ సమగ్రంగా కవర్ అవుతాయని స్పష్టం చేశారు. అందుకే ఏటూరునాగారమే అనుకూల ప్రాంతమని సూచించగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. అలాగే మంగపేట, ములుగు తదితర మండలాల్లో మినీ బస్‌స్టేషన్లను కూడా మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. రాబోయే రోజుల్లో బీసీ సంక్షేమ శాఖ ద్వారా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మాస్టర్‌ప్లాన్‌కుఅనుగుణంగామేడారంఅభివృద్ధి మేడారం జాతర ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న నిర్మాణాలు, షెడ్లు, క్యూ లైన్ల రూపకల్పన పూర్తిగా మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. జాతర సమయంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్లను ప్రస్తుతం వినియోగంలోకి తీసుకువస్తున్నామని, అయితే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని తిరిగి అమర్చుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. గద్దెల ప్రాంగణాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసే దిశగా మాస్టర్ ప్లాన్ రూపొందించామని, జాతర అనంతరం అవసరమైతే కొన్ని షెడ్లను తొలగించి మరింత అనుకూలమైన ప్రాంతాల్లో తిరిగి ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం షెడ్ల నిర్మాణాన్ని బోల్టు, నట్లు ఉపయోగించే విధంగా రూపొందించామని, తద్వారా భవిష్యత్తులో సులభంగా మార్పులు చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నఫ మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ, ఏటూరు నాగారం ప్రాంతంలో RTC డిపో మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అటవీ ప్రాంతం కావడంతో ఇక్కడి నుంచి భద్రాచలం సహా ఇతర ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు పరిమితంగా ఉండేవని, RTC డిపో ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు, భక్తులకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. అలాగే మేడారం ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నందుకు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. RTC సంస్థ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం రాష్ట్రంలో ఒక చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొంటూ, ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో మహిళలకు, గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు.